
14/4/96



# ముక్కుమీద ముద్దు

— యం.ఐ. కిషన్



''అన్నట్టు నువ్ 'జట్కావాడు' సిన్మా చూశావా?''

స్నేహితురాలి ప్రశ్నకు చూశానన్నట్టు నిలువుగా తలాడించి, 'అయితే ఏంటి?' అన్నట్టు కళ్ళెగరేసింది అనురాగలత.

''ఆ సిన్మాలో మావారు నటించారు...'' కించిత్ గర్వంగా చెప్పింది శ్యామల.

అనురాగలత కళ్ళు ఆశ్చర్యంతో ఆల్చిప్పల్లా విచ్చుకున్నాయి. ''ఏంటి? మీ వారు సినిమాల్లో నటిస్తారా? మరిందాక అదేదో బ్యాంక్‌లో క్యాషియరని చెప్పినట్టున్నావే?!'' అంది రవంత అనుమానంగా.

''నట్టుండటం కాదు -. చెప్పేను. ఉద్యోగ రీత్యా మావారు బ్యాంకులో క్యాషియరే. కాని నటన వారికి హాబీ. అడపాదడపా సినిమాల్లో వేస్తుంటారు...''

''అలాగా?! మీ వారి పేరేంటి? ఇప్పటికెన్ని సిన్మాల్లో నటించారు? 'జట్కావోడు'లో మీ వారి పాత్రేంటి?'' - చాన్నాళ్ళ తర్వాత అనుకోకుండా కన్పించిన చిన్ననాటి స్నేహితురాలు తన భర్త ఓ సిన్మా యాక్టరని చెప్పడం... చాలా థ్రిల్లింగ్‌గా అనిపించింది అనురాగలతకి. సిన్మాయాక్టర్ల కుండే గ్లామరలాంటి దాయె! అందుకే అంత కుతూహలంగా అడిగిందామె.

''ఛీ నోర్మూయ్... దొంగరాస్కెల్... మూడు పగులుద్ది...'' అంది శ్యామల.

అనురాగలత బిక్కచచ్చిపోయింది.

''ఇప్పుడు నేనేమన్నానని...'' అంది భయం భయంగా.

''నువ్వేమనడమేంటి? అవి మావారు నటించిన సిన్మాలు. ప్రస్తుతం నడుస్తోన్న 'జట్కావోడు' నాలుగోది'' అంది శ్యామల.

దాంతో అనురాగలత గుండె తేలిక పడింది. అనవసరంగా కన్ఫ్యూజైపోయింది తను. నిజమే కదా! ఛీ నోర్మూయ్, దొంగరాస్కెల్, మూడుపగులుద్ది అనేవి మూడూ మూడు సిన్మాలే కదా? ఏమిటో ఈ పేర్లు పెట్టడం? అనుకుంది లోలోన.

''ఆ మూడూ నేనూ చూశ్ళేదులే గాని... 'జట్కావోడు'లో మీ వారిది ఏ పాత్ర?''

''హీరో తల్లి చనిపోయినప్పుడు ఆమెని స్మశానానికి తీసుకెళ్తారు కదా! పాడె వెనుక ఆరేడుమంది జనం ఉంటారు చూడూ, అందులో ఒకరు మావారే''

''మరీ అంత చిన్న పాత్రా?'' - 'ఈపాటిదానికేనా అంతోటి సంబడం?' అని పైకయితే అనలేదు గాని, అన్నట్టుగానే చూసింది అనురాగలత.

దాంతో శ్యామల ముఖం కొంచెం కళ తప్పింది. ''చిన్న పాత్ర అని తేలిగ్గా తీసి పారేయబోకు. ఇప్పుడు సూపర్‌స్టార్లుగా వెలిగిపోతున్న వారిలో కొందరు మొదట్లో ఇలా చిన్నపాత్రలు వేసిన వారే తెల్సా?'' అంది లోలోన ఉడుక్కుంటూ.

అది గమనించిన అనురాగలత, ''ఆ మాటా నిజమేలే'' అనేసింది, స్నేహితురాల్ని మరింత బాధించడం దేనికి లెమ్మని.

★ ★ ★

భర్తతో విషయం చెప్పి, ''మొగుడు అంత చిన్నచిన్న పాత్రలు ధరిస్తున్నందుకే ఆ శ్యామల ఎంతగర్వంగా చెప్పుకుందో తెలుసాండి? చాన్నాళ్ళకి కలిసింది... చదువుకునే రోజుల్లో మేమిద్దరం ప్రతి దానికీ ఒకరితో ఒకరు పోటీలు పడుతుండేవాళ్ళం... సిటీలో ఎవరిదో బంధువుల పెళ్ళుంటే వచ్చిందట...'' అంటూ క్షణమాగి... 'ఏవండేవండేనండీ...'' అంది అనురాగలత గోముగా.

''ఏమిటనూ?'' అన్నాడు గోవిందరావ్, దేనికో టెండరు పెట్ట బోతున్నట్టుందని లోపల్లోపల భయపడుతూ.

అతగాడి మెడచుట్టూ చేతులల్లుతూ అంది. ''ఏం లేదండీ... ఒక్కసారి... ఒకే ఒక్కసారి... మిమ్మల్ని కూడా వెండి తెర మీద చూడాలని ఉందండీ...''

గోవిందరావుకి నవ్వాలో ఏడ్వాలో అర్థం కాలేదు.

''ఆఫీసు నుండి వచ్చేటప్పుడు ఓ మూర మల్లెపూలు తెండి - అన్నంత ఈజీగా అనేశావే?! వెండి తెర మీద కనిపించడమంటే మాటలా?'' చిరుకోపంగా అన్నాడు.

''ఏమోనండీ అదంతా నాకు తెలీదు... చిన్నప్పుడు నేనా శ్యామలతో ప్రతిదానికీ పోటీ పడి నాదే పై చేయి అనిపించుకుంటూ ఉండేదాన్ని. దాని భర్త వెండితెర మీద కనిపించేడు కాబట్టి మీరు కనిపించాల్సిందే...'' అంటూ అతగాడి ముక్కు మీద ముద్దెట్టింది అనురాగలత.

ముక్కు మీద ముద్దుకి వారి దాంపత్యంలో 'రాత్రికి మీ ఇష్టం' అనే అర్థం కూడా ఒకటుండటం వల్ల - ముందూ వెనుకా ఆలోచించకుండా

ఓకే... ఐ విల్ ట్రై మై లెవెల్ బెస్ట్... యు కెన్ సీ యువర్ హబ్బీ ఆన్ ది సిల్వర్ స్క్రీన్ విదిన్ షార్ట్‌టైమ్...'' అనేశాడు గోవిందరావ్.

మళ్ళీ ముక్కుమీద ముద్దెట్టబోయి ఠక్కున ఆగిపోయింది అనురాగలత. 'ట్రిపుల్ సారీ అండీ'' అంది బేలగా.

వారి దాంపత్యంలో 'ట్రిపుల్ సారీ' అనే పదానికి 'ఐదు రోజులు ఎడబాటు తప్పదు' అనే అర్థం కూడా ఒకటుండటం వల్ల గోవిందరావ్ పరిస్థితి పాలపొంగుపై చన్నీటి చిలకరింతైంది.

''హతోస్మి'' అనుకున్నాడు బాధగా.

★ ★ ★

ఆరోనాడు అర్ధాంగిని అక్కున చేర్చుకోబోయిన గోవిందరావ్ ''ఆ సంగతేం చేశారూ?'' అంటూ ఆమె తనని దూరంగా నెట్టేయడంతో బిత్తరపోయాడు.

''ఏ సంగతి?'' అన్నాడు అయోమయంగా.

''అదేనండీ మీరు వెండితెరపై తళుక్కున మెరిసే సంగతి'' అంటూ గుర్తు చేసింది అనురాగలత.

''ఉల్లిపాయలున్నాయా?'' అనడిగితే కిరాణా షాపువాడు, ''లేవండీ! సూర్ఫ్ సబ్బుంది కావాలా?'' అని ఎదురడిగా డనుకోండి. అప్పుడెవరికైనా ఎంత కోపమొస్తుందో అంత కోపమొచ్చింది గోవిందరావుకి. అయినా కోపగించుకోవడానికది తగిన సమయం కాదు గనుక అతి కష్టమ్మీద నిగ్రహించుకున్నాడు.

''ఆ గొడవ ఇప్పుడు దేనికోయ్? తర్వాత చూసుకోవచ్చులే'' అంటూ ఆమెని మళ్ళీ అల్లుకోబోయాడు.

''అంటే అసలు మీరింకా ప్రయత్నాలే మొదలెట్టలేదన్నమాట?'' అనురాగలతతో మళ్ళీ దూరంగా నెట్టివేయబడ్డాడు గోవిందరావ్.

''రేపట్నుంచి తప్పకుండా మొదలుపెడ్తా! ఈ ఒక్క రోజుకే అనుగ్రహించు ప్లీజ్...''

''నో ప్లీజ్, నథింగ్ డూయింగ్! మీరు నా కోరిక తీర్చే దాకా 'నో ముక్కు మీద ముద్దూస్' దట్సాల్'' అని బిగిసిపోయింది అనురాగలత.

భార్య ఎంత మొండిదో బాగా ఎరిగున్న గోవిందరావ్ హతాశుడయ్యాడు.

''హతవిధీ'' అనుకున్నాడు మనసులో బాధగా.

అవును మరి! ఆమె మాటంటే మాటే!

★ ★ ★

మర్నాడాఫీసులో తన కొలీగ్ కైలాసరావుతో తనకొచ్చిపడిన సమస్య గురించి చెప్పుకుని బాధపడ్డాడు గోవిందరావ్.

అతను తనకి బాగా క్లోజ్ ఫ్రెండ్.

''డోంట్ వర్రీ గోవిందరావ్! అదేమంత కష్టం కాదు. కృష్ణనగర్‌లో అప్పాజీ అని ఒక సప్లయర్ ఉన్నాడు. అతను నిన్ను ఈ ఆపద నుండి గట్టెక్కించగలడు...'' అన్నాడు కైలాసరావ్.

''సప్లయరంటే కాఫీ హోటల్లో...''

గోవిందరావ్ మాట పూర్తి కాకముందే ఘొల్లున నవ్వాడు కైలాసరావ్. ''నీ మొహం! అతనలాంటి సప్లయర్ కాదు. జూనియర్ ఆర్టిస్టులని ఇండస్ట్రీకి సప్లయ్ చేసే సప్లయర్'' అంటూ విశదీకరించాడు, నవ్వడం అయ్యాక.

ప్రాణం లేచొచ్చినట్టు ఫీలయ్యాడు గోవిందరావ్.

''ఎప్పుడు వెళ్దాం?'' అన్నాడు ఉత్సాహంగా.

''నువ్వెప్పుడంటే అప్పుడే'' అన్నాడు కైలాసరావ్, మిత్రుడి భుజం తడ్తూ.

★ ★ ★

విషయం తెలుసుకున్న అప్పాజీ, 'ఓస్ అంతే కదా?'' అనేశాడు తేలిగ్గా.

''అంత ఈజీనాండీ? ఆనందంగా అడిగాడు గోవిందరావ్.

''వెరీ సింపుల్! ఓ ఫైవ్‌హండ్రెడ్ రుపీస్ కట్టేసి జూనియర్ ఆర్టిస్టుల అసోసియేషన్‌లో మీ పేరు రాయించేసుకుని వెళ్ళండి... ఓ వారం తిరిగే సరికల్లా మీ ఫేసుని సెల్యూలాయిడ్ మీద కెక్కించేసే పూచీ నాది'' అంటూ ఉత్సాహ పరిచాడు అప్పాజీ.

ఆ గారపళ్ళ బట్టనెత్తి ఆసామిలో ఆ క్షణాన్న సాక్షాత్తూ ఆ భగవంతుణ్ణే చూడగలిగాడు గోవిందరావ్.

ముక్కు మీద ముద్దూస్ లేకుండా జీవించడం అయితే కష్టంగాని... ఆఫ్టరాల్ అయిదు వందలు మళ్ళీ సంపాదించడం ఎంతసేపు? అనుకుని... మహదానంగా అప్పాజీకి అయిదొందలు సమర్పించుకుని... అతనిచ్చిన రశీదు అనబడు చీటీ ముక్కని జేబులో కుక్కుకుని గాల్లో తేలియాడ్తూ ఇల్లు జేరాడు గోవిందరావ్.

★ ★ ★

అనడమైతే 'వెరీ సింపుల్' అన్నాడు గాని, తీరా తీరా డబ్బులు గుంజుకున్నాక 'తొందరపడితే ఎలాగండీ? అవకాశం కలిసి రావాలి కదా? నా ప్రయత్నాలు నేను చేస్తూనే ఉన్నా... కొంచెం ఓపిక పట్టండి మరి'' అంటూ గోవిందరావుని తన చుట్టూ బొంగరంలా తిప్పుకోసాగాడు అప్పాజీ.

'మరి మొదట్లో చాలా సింపులన్నారు కదండీ?' అంటే 'సింపుల్ అంతే సాధ్యమే' అని అర్థమున్నమాట' అంటూ సింపుల్ అనే పదానికి కొత్త అర్థాన్ని చెప్పి గారపళ్ళు పైనేశాడు.

ట్రిప్పుట్రిప్పుకి బస్చార్జీలతో పాటు, అప్పాజీకి టిఫిన్లు తిన్పించి కాఫీలు పొయ్యించడానికి కొంచెం అటూ ఇటూగా ఓ వంద వొదుల్తుండటంతో కొంత కాలానికి గుండె భేజారెత్తిపోయి... అతగాడికో నమస్కారం పెట్టేశాడు గోవిందరావ్.

కింకర్తవ్యం?

ముక్కుమీద ముద్దూస్ లేకుండా జీవితాంతం బ్రతికేయడమేనా?

నో... అలా బ్రతకడం కన్నా అర్జంటుగా చావడం మిన్న.

అలా అనిపించాక, ఎందుకులే అప్పుడే చచ్చిపోవడం అనిపించి స్వీయ ప్రయత్నాలు ప్రారంభించాడు గోవిందరావ్.

నో... అలా బ్రతకడం కన్నా అర్జంటుగా చావడం మిన్న.

అలా అనిపించాక, ఎందుకులే అప్పుడే చచ్చిపోవడం అనిపించి స్వీయ ప్రయత్నాలు ప్రారంభించాడు గోవిందరావ్.

ఫలానా డైరెక్టర్ ఫలానా చోట బస చేశాడని తెలుస్తే చాలు... వాచ్‌మేన్లకి రూంబోయ్‌లకీ లంచాలిచ్చి ఆయా డైరెక్టర్లని నేరుగా కలిసి వేషమోచన చెయ్యడం మొదలు పెట్టాడు.

''నేను బళ్ళారి రాఘవగారి బామ్మర్ది కొడుక్కి వేలు విడిచిన మేనల్లుణ్ణి'' అన్నాడు ఒక డైరెక్టర్‌తో.

''నేను స్థానం నరసింహారావుగారి అక్కగారి తోడికోడలికి వేలు 'విడవని' మేనల్లుణ్ణి'' అన్నాడు ఇంకో డైరెక్టర్‌తో.

''...'' అన్నాడు మరో డైరెక్టర్‌తో.

''...'' అన్నాడు వేరొక డైరెక్టర్‌తో.

''అయితే ఏంటంట?'' అంటూ అందరూ గసిరి పారేశారే తప్ప వేషం ఇవ్వడానికి ఏ ఒక్క డైరెక్టరూ ముందుకురాలేదు.

ఈ భూమండలం మీదున్న డైరెక్టర్లందరూ మహానుభావుల్ని గౌరవించడం తెలియనివాళ్ళే, అన్న నిర్ధారణ కొచ్చేశాక... ఈ పద్ధతి లాభం లేదనిపించి, తన స్వీయ బుర్రకి పదునుపెట్టి మరో కొత్త ఉపాయం ఆలోచించాడు గోవిందరావ్.

ఆ ప్రకారంగా ఆ మర్నాడు ఓ ప్రముఖ దినపత్రికలో బోల్డన్ని డబ్బులు కట్టి ఓ ప్రకటన ఇచ్చాడు...

''కావలెను

అవకాశాలు లేక వెలుగులోకి రాలేకపోతున్న ఓ ప్రతిభావంతుడైన నటుడికి తెలుగు చలనచిత్రాల్లో తగు పాత్రలు కావలెను. ఆసక్తిగల నిర్మాత, దర్శకులు ఈ క్రింది చిరునామాకి వ్రాయండి...'' అంటూ.

ఆ ప్రకటన వెలువడిన మూడోనాడు...

''అబ్బ! ఎన్ని ఉత్తరాలో!'' అంటూ ఆశ్చర్యపోయింది అనురాగలత, పోస్ట్‌మేన్ తమ వరండా మీద గుమ్మరించి పోయిన ఉత్తరాల గుట్టకేసి విప్పారిన కళ్ళతో చూస్తూ.

''ఉత్తరాలు కాదోయ్... అవన్నీ 'అవకాశాలు'. మన ప్రకటన చూసి నాకు పాత్రలివ్వడానికి నిర్మాత దర్శకులందరూ ముందుకొచ్చేస్తున్నా రన్నమాట! ఇంక చూస్కో... ఒక్క సినిమాలో ఏం ఖర్మ? ఏడాది తిరిగేసరికల్లా వెయ్యి సినిమాల్లో నటించేసి రికార్డు సృష్టించేస్తారు మీ శ్రీవారు...'' అని సగర్వంగా ప్రకటించేసి, ''ఇక నుండి మనకి రోజూ ముక్కు మీద ముద్దూసే'' అని ఆనందంతో గుండెలు బాదుకుని ఉత్తరాల గుట్టలోంచి ఓ కార్డందుకున్నాడు గోవిందరావు.

''జై సంతోషిమాత

సంతోషిమాత అమ్మవార్ని స్తుతిస్తూ మీరు కూడా ఓ వంద మందికి ఇలా ఉత్తరాలు రాస్తే మీకు శుభం కలుగుతుంది. ఒకడు ఇలాగే వంద ఉత్తరాలు రాసి పంపించగా అతనికి లాటరీలో పది లక్షలు వచ్చాయి. మరొకడు ఇలాంటి ఉత్తరాన్ని చించి పడెయ్యగా ఏక్సిడెంట్‌లో అతని భార్య చనిపోయింది. కాబట్టి దీన్ని మీరు నిర్లక్ష్యం చేయకుండా ఇలాంటివే ఓ వంద ఉత్తరాలు రాసి మీ మిత్రులకి పంపించండి.

ఇట్లు
ఒక భక్తుడు''

ఇదీ ఆ లేఖలోని విషయం.

గోవిందరావ్ జుత్తు పీక్కుని మరో ఉత్తరం అందుకుని పరిశీలించాడు. అదీ ఆ బాపతు ఉత్తరమే! కానైతే దేవత పేరు మాత్రం వేరు.

దాంతో నీరుగారిపోతూ ఆత్రంగా మిగతా ఉత్తరాలన్నీ కూడా పరిశీలించాడు గోవిందరావ్.

అన్నీ అలాంటివే... తద్భిన్నమైనది ఒక్కటుంటే ఒట్టు.

ఒళ్ళు మండిన గోవిందరావ్ అగ్గిపుల్ల గీసి ఆ ఉత్తరాల గుట్టకి నిప్పంటించబోయాడు.

కాని 'ఉఫ్'మని గాలూది ఆ అగ్గిపుల్ల నార్పేసింది అనురాగలత.

''ఏంటి మీరు చెయ్యబోతున్న పని? ఏం... నేను ఏక్సిడెంట్‌లో పోతే ఇంచక్కా ఇంకోదాన్ని కట్టుకుని ముక్కుమీద ముద్దూస్ పెట్టించుకోవచ్చని ఆశపడుతున్నారా? ఆ పప్పులు మన దగ్గిరుడకవ్. వచ్చే జన్మ సంగతి తెలియదు గాని ఈ జన్మలో మాత్రం మీ ముక్కు మీద నేనప్ప ఇంకెవత్తీ ముద్దు పెట్టడానికి వీల్లేదు. అవన్నీ ఎన్ని వందలున్నాయో లెక్కపెట్టి, అన్నీ ఇంటూ అన్ని వందలు - మీరు రాయండి'' అంటూ ఉరిమి చూసింది గోవిందరావు కేసి.

''గోవిందా గోవింద'' అనుకున్నాడు గోవిందరావ్.

★ ★ ★

ఒక లక్షా తొంబై ఎనిమిదివేల తొమ్మిది వందలు ఉత్తరాలు రాశాక 'హమ్మయ్య... ఐపోయాయ్'' అన్నాడు గోవిందరావ్.

అనురాగలత భర్తకు తన మీద గల అనురాగానికి మురిసిపోతూ అతని ముక్కు మీద ముద్దుపెట్టింది. కాని...

నీరసంతో సొషొచ్చి పడిపోయేలా ఉన్న గోవిందరావ్ ''ట్రిపుల్ సారీ డియర్!'' అన్నాడు బేలగా.